

బీజేపీని బలోపేతం చేయాలి

కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో బీజేపీని బలోపేతం చేయాలని బాణాల లక్ష్మారెడ్డి సూచించారు.

- 9లో ▸



బోనాల ఉత్సవాలకు సన్నద్ధం

దోమకొండ మండల కేంద్రంలోని మహంకాళి ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.6 /22.3

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వివిధ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

మాఫీ కొందరికేనా?!

- జాబితాలో తమ పేర్లు లేవని రైతుల ఆవేదన
- వ్యవసాయ శాఖ అధికారులకు ఫోన్లు
- రూ. లక్షలోపు ఉన్నా మాఫీ కాలేదని ఫిర్యాదులు



సాక్షి, కామారెడ్డి: రుణమాఫీ సంబరాలు ఒక వైపు జరుగుతుండగా.. మరోవైపు మాఫీ జాబితాలో తమ పేర్లు లేవంటూ చాలామంది రైతులు ఆవేదనకు గురవుతున్నారు. తమకు ఎందుకు మాఫీ కాలేదంటూ వ్యవసాయశాఖ అధికారులకు ఫోన్లు చేసి అడుగుతున్నారు. జిల్లాలో తొలి విడతలో రూ. లక్షలోపు రుణాలు 49,540 మంది రైతులకు సంబంధించి రూ. 235.61 కోట్లు మాఫీ అయిన విషయం తెలిసిందే. అయితే జిల్లాలో రూ. లక్షలోపు రుణాలున్న చాలామంది రైతులకు మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో జిల్లాలో లక్షా నాలుగు వేల మంది రైతులకు రుణాలు మాఫీ అయ్యాయి. అప్పుడు మాఫీ అయిన వాళ్లకు ఇప్పుడు మాఫీ అయ్యాయి. అయితే అప్పుడు చాలామంది రైతులు మాఫీ అవకాశం కోల్పోయారు. ఇప్పుడు కూడా వాళ్లకే నష్టం జరిగినట్లు తెలుస్తోంది. రెగ్యులర్‌గా అప్పు కట్టి, రెన్యూవల్ చేసుకున్న రైతులు చాలా మందికి మాఫీ జరగలేదని తెలుస్తోంది. రుణ మాఫీ కోసం ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న రైతులు జాబితాలో తమ పేర్లు లేవని తెలిసి మనోవేదనకు గురవుతున్నారు. ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేయించుకున్న పాపానికి తమకు మాఫీ కాలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకొందరు ఎందుకు మాఫీ కాలేదో అర్థం కావడం లేదని పేర్కొంటున్నారు.

టోల్‌ఫ్రీ నంబర్‌కు 106 ఫిర్యాదులు

పంట రుణం మాఫీ కాని రైతులు వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్‌చేసి తమ ఆవేదనను చెప్పుకుంటున్నారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి 106 మంది రైతులు కాల్స్ చేస్తూ తమ రుణం మాఫీ కాని విషయంపై ఫిర్యాదులు చేశారు. ఇంకొందరు రైతులు స్థానికంగా వ్యవసాయ శాఖ అధికారులను కలిసి తమకు ఎందుకు రాలేదని అడుగుతున్నారు. చాలా మంది రైతులు రుణమాఫీ జరగకపోవడంతో నిరాశకు గురయ్యారు. ప్రభుత్వం ఎన్నో ఆశలు కల్పించిందని, అందరికీ మాఫీ చేస్తామని చెప్పి కొందరికే చేయడం సరికాదని పేర్కొంటున్నారు. అన్ని అర్హతలు ఉన్నా తమకు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

48,975 మంది ఖాతాల్లో జమ

జిల్లాలో 49,540 మంది రైతులకు రుణమాఫీ జరగగా 48,975 మంది ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. డీబీటీ సమస్యతో 154 ఖాతాలు, 102 మంది ఖాతాలు క్లోజ్ అయి, అకౌంట్ నంబర్లు సరిగ్గా లేనివి 306 ఖాతాలకు డబ్బులు జమ కాలేదన్నారు. అలాగే ముగ్గురికి పేమెంట్స్ నిలిపివేయడం జరిగిందన్నారు. అయితే రుణమాఫీకి సంబంధించి జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సమీక్షించారు.

మేము రైతులం కాదా..?



మాచారెడ్డి: మాచారెడ్డి ఎస్‌బీఐలో రూ. 37 వేలు పంట రుణం తీసుకున్నా. రుణ మాఫీ జాబితాలో నా పేరు రాలేదని బ్యాంక్ అధికారులను అడిగితే మొదటి జాబితాలో రాని వారి పేర్లు రెండో విడతలో వస్తాయని చెప్పింద్రు. ప్రభుత్వం లక్ష లోపు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. మళ్లీ రూ. 50 వేలలోపు తీసుకున్న వారివి మాఫీ కావని అధికారులు చెబుతున్నారు. చేస్తే అందరికీ చేయాలి. ఇట్ల జేసుడు మంచిది కాదు. బాధని పిస్తుంది. – బట్టు ఎల్లయ్య, రైతు, అక్కాపూర్

లిస్ట్‌లో నా పేరు లేదు..



పిట్లం: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో పట్టా పాస్‌బుక్‌పై 2020 సంవత్సరంలో రూ. 60 వేల రుణం తీసుకున్నాను. ఇటీవల ప్రభుత్వం రైతులకు రూ. లక్షలోపు ఉన్న రుణాలను మాఫీ చేశారని చెప్పడంతో బ్యాంక్‌కు వెళ్లి చూడగా లిస్టులో నా పేరు లేదు. ఈ విషయంపై బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్‌ను అడుగుదామనుకుంటే ఆయన సెలవులో ఉన్నారని చెప్పడంతో తిరిగి వచ్చేశా. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి రుణం మాఫీ చేస్తే బాగుంటుంది. – కుమ్మరి మంజుల, మహిళ రైతు, పిట్లం

రెన్యూవల్ చేసినా మాఫీ కాలేదు



భిక్కనూరు: నేను భిక్కనూరులోని కెనరా బ్యాంకులో పంటల సాగు కోసం రూ. 51వేల రుణం తీసుకున్నాను. క్రమం తప్పకుండా సరైన సమయంలోనే రెన్యూవల్ చేసుకున్నా నాకు రుణమాఫీ కాలేదు. కొందరు రెన్యూవల్ చేసుకోకపోయినా వారికి వర్తించింది. అలాగే కేసీఆర్ హయాంలో మాఫీ అయిన వారికి కూడా ఇప్పుడు అయ్యింది. నాకు మాత్రం కాలేదు. బ్యాంక్, వ్యవసాయాధికారులను అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదు. అందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి. – బూర్ల వీరేశం, రైతు, భిక్కనూరు



మాచారెడ్డిలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న షబ్బీర్ అలీ

రైతుల కన్నీటిని తుడిచినం..

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

మాచారెడ్డి/బీబీపేట: గత ప్రభుత్వంలో రైతు కంట కారిన కన్నీటిని రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తుడిచిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శుక్రవారం మాచారెడ్డి, పాల్వంచ, బీబీపేట మండలాల్లో నిర్వహించిన రైతు రుణ మాఫీ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల ముఖాల్లో ఆనందం కొట్టొచ్చినట్టు కనబడుతోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజా పాలనలో తమ ఆలనా పాలన ఇక కాంగ్రెస్ ప్రభుత్వం చూసుకుంటుందన్న నమ్మకం రైతుల కళ్లల్లో కనబడుతోందన్నారు. రాహుల్ గాంధీ వరంగల్‌లో జరిగిన రైతు డిక్లరేషన్‌లో ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి తీరిందన్నారు. ఎన్నికల్లో మాట ఇచ్చిన విధంగా ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామని చెప్పి మాట నిలబెట్టుకున్నామన్నారు. కామారెడ్డి నియోజకవర్గానికి 57.36 కోట్లు మాఫీ జరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, మండలాధ్యక్షుడు నాసిలాల్, ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేశారు

- కొర్రీలు పెట్టి రైతులకు అన్యాయం
- రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఫైర్

సాక్షి, కామారెడ్డి: రుణమాఫీ పేరుతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెడుతోందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఉచిత కరెంటు, రైతుబంధు, ధాన్యం కొనుగోళ్లు, రూ. 28వేల కోట్ల రుణమాఫీ వంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందన్నారు. రైతులకు మేలు చేయాల్సిన ప్రభుత్వం వారిని వంచిస్తోందని విమర్శించారు. రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 6వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి సంబరాల పేరుతో రైతులను మోసం చేస్తోందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు రైతుల రుణాలన్నింటినీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వానాకాలం సీజన్‌కు ఎకరానికి రూ. 7,500 చొప్పున రైతుభరోసా కింద ఇవ్వాల్సిన రూ. 11,250 కోట్లను ఎగ్గొట్టి ఆ డబ్బులో నుంచే రుణమాఫీకి రూ. 6,098 కోట్లు విదిల్చిందన్నారు. రూ. 31వేల కోట్లు ఒకేసారి మాఫీ చేస్తామని చెప్పి రూ. 6వేల కోట్లే ఇచ్చిందన్నారు. 37లక్షల మంది రైతులుంటే కొర్రీలు పెట్టి 11లక్షల మందికి కుదించారన్నారు. ఉమ్మడి జిల్లాలో 2016లో రూ. లక్షలోపు రుణాలు 3,79,520 మంది రైతులకు రూ. 1576కోట్లు, 2018లో రెండోసారి 1,95,657 మంది రైతులకు రూ. 942 కోట్లు మాఫీ చేశామని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 94,566 మంది రైతులకు రూ. 459 కోట్లు మాత్రమే రుణమాఫీ చేసిందన్నారు. రైతులకు ఎవరు ఎక్కువ ఇచ్చారో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

న్యూస్‌రీల్

అంతర్జాతీయ సెమినార్‌లో పాల్గొన్న సౌత్‌క్యాంపస్ హెచ్‌వోడీ



భిక్కనూరు: ఉస్మానియా యూనివర్సిటీలో రెండురోజులుగా జరుగుతున్న జల స్థిరత్వం గ్రామీణాభివృద్ధిపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ జియో ఇన్ఫర్‌మెటిక్స్ హెచ్‌వోడీ కవితా తోరన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ సభ్యులతో కలిసి పలు అంశలపై చర్చించారు. జల స్థిరత్వంపై తీసుకోవాల్సిన చర్యలపై సదస్సులో వివరించి పలువురి మన్ననలు పొందారు. ఈ విషయమై సౌత్‌క్యాంపస్ అధ్యాపకులు ఆమెను అభినందించారు.

రాష్ట్రానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. విద్య, వైద్య రంగంతో పాటు సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. శుక్రవారం జుక్కల్‌లో సెంట్రల్ లైటింగ్ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో జుక్కల్ అభ్యున్నతికి ప్రత్యేకంగా నిధులు తెస్తానని పేర్కొన్నారు. గిరిజన తండాలు, గ్రామాలకు బీటీ రోడ్లు, మురికి కాలువలు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అస్పత్‌వార్ వినోద్, రమేశ్ దేశాయ్, శివానంద్ పాల్గొన్నారు.

చేపల అక్రమ వేటపై కొరడా

- దప్తరి దుకాణాలకు తాళాలు



సాక్షి ఎఫెక్ట్..

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టులో చేపల అక్రమ వేటపై మత్స్యశాఖ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. రింగులు, పాండ్రిలతో వేటను అరికట్టడంతో పాటు దప్తరి దుకాణాలకు తాళాలు వేయించారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో అక్రమంగా చేపల వేట అంటూ ఈ నెల 16న 'సాక్షి' దినపత్రిక జిల్లా పేజీలో వచ్చిన కథనానికి కలెక్టర్‌తో పాటు జిల్లా మత్స్యశాఖ అధికారులు స్పందించారు. అక్రమంగా చేపలను వేటాడుతున్న జంగమాయపల్లి, సాతెల్లి, మల్కాపూర్, ఆరేడ్, ఆరేపల్లి, మాదవపల్లి, రాంరెడ్డిపేట గ్రామాల్లో మత్స్యశాఖ ఎఫ్‌డీవో డోలిసింగ్, ఫిషర్‌మెన్ సురేశ్‌గౌడ్ దాడులు నిర్వహించారు. అయా గ్రామాల్లో ఉన్న దప్తరి దుకాణాలకు తాళాలు వేయించడంతో పాటు వలల ద్వారా చేపల వేట చేపడుతున్న మత్స్యకార్మికులను హెచ్చరించారు. రెండు నెలల పాటు నిజాంసాగర్ ప్రాజెక్టులో చేపలవేటను పూర్తిగా నిషేధిస్తున్నామని తెలిపారు. అక్రమంగా ఎవరైనా చేపల వేట కొనసాగిస్తే పోలీస్ కేసులు నమోదు చేయిస్తామని చెప్పారు.

సిద్దిపేట నుంచి పోటీకి సిద్ధం

- హరీశ్‌రావు రాజీనామా చేయాలి
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



ర్యాలీలో మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రావు

లింగంపేట(ఎల్లారెడ్డి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తన పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన లింగంపేటలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మాట ఇస్తే మడమతిప్పదన్నారు. గతంలో వైఎస్సార్ రూ. లక్ష రుణమాఫీ చేస్తే మళ్లీ నేడు రూ. రెండు లక్షలు మాఫీ చేశామన్నారు. ఇది చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మాటమీద నిలబడి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తాను సిద్దిపేట నుంచి పోటీచేసి గెలుస్తానని హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధమా అని సవాల్ విసిరారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ కనుమరుగు కాకతప్పదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, యూత్ అధ్యక్షుడు సుప్పాల రాజు, అట్టెం శ్రీనివాస్, అశోక్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ఎల్లారెడ్డి కస్తూర్బాలో విద్యార్థులతో కలిసి భోజనం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం ఎల్లారెడ్డి మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని హాజీపూర్ కట్టకింది తండాలోని అంగన్‌వాడీ పాఠశాలను పరిశీలించి రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు గణితం బోధించారు. తర్వాత మోడల్ డిగ్రీ కళాశాల ఆవరణలో వన మహోత్సవంలో మొక్కలను నాటారు. ఎల్లారెడ్డి పట్టణంలోని పెద్ద చెరువు కట్ట వద్ద జరుగుతున్న మినీ ట్యాంక్ బండ్ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కళాశాల విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు ఎంసెట్, ఐఐటీ కోర్సులకు ప్రిపేర్ కావాలని సూచించారు. అనంతరం డీఈవో రాజుతో మాట్లాడుతూ జిల్లాలోని కేజీబీవీలలో ఐఐటీ, ఎంసెట్ కోచింగ్ కోసం తరగతులను చెప్పించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రిలో వైద్యుల భర్తీ కోసం కృషి చేయాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు, డ్వామా పీడీ చందర్‌నాయక్, నీటిపారుదల శాఖ, పంచాయత్ రాజ్ డీఈఈలు వెంకటేశ్వర్లు, గిరిధర్, ఏఈలు వినోద్, రమేశ్, ప్రవీణ్, శ్రీకాంత్, సతీశ్ పాల్గొన్నారు.

ఆస్పత్రిని వెంటాడుతున్న విద్యుత్ షాక్ సమస్య

- ఆపరేషన్ థియేటర్‌లో మిషన్లకు కరెంట్ సరఫరా
- సొమ్మసిల్లి పడిపోయిన పేషెంట్
- కు.ని.ఆపరేషన్‌లు వాయిదా



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని విద్యుత్ షాక్ సమస్య ఇంకా వెంటాడుతూనే ఉంది. గురువారం రాత్రి ఆస్పత్రి గ్రౌండ్ ఫ్లోర్‌లోని గోడలకు విద్యుత్ సరఫరా జరగడంతో రోగులను రెండో అంతస్తుకు తరలించిన విషయం తెలిసిందే. తేలికపాటి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆస్పత్రిలో విద్యుత్ షాక్ కష్టాలు శుక్రవారం సైతం వెంటాడాయి. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తులో ఉన్న ఆపరేషన్ థియేటర్ గోడలకు, అందులోని మిషన్లకు సైతం విద్యుత్ షాక్ వస్తోంది. శుక్రవారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు ముగ్గురు పేషెంట్లను అడ్మిట్ చేసుకున్నారు. ఆపరేషన్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. సరిగ్గా ఆపరేషన్ సమయానికి థియేటర్‌లోని ప్రధాన యంత్రాలకు విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లు గుర్తించి ఆపరేషన్ల ప్రక్రియను వాయిదా వేశారు. ఆపరేషన్ కోసం వేచి ఉండి ఆలస్యం కావడంతో ఓ మహిళ పేషెంట్ సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే వైద్యులు ఆమెకు ప్రథమ చికిత్స అందించారు. ఆపరేషన్లను సోమవారానికి వాయిదా వేశారు. మొదటి అంతస్తులోని యంత్రాలకు విద్యుత్ సరఫరా జరుగుతుండడంతో రోగులను రెండో అంతస్తులో నిర్మించిన రేకుల షెడ్డులోకి మార్చారు.

గతంలోనూ ఇలాగే..

కామారెడ్డి జిల్లా ఆస్పత్రి భవనం చాలా కాలం క్రితం నిర్మించినది కావడంతో వర్షం పడిన సమయంలో గోడలు తేమతో తడుస్తున్నాయి. దీంతో చాలా సార్లు విద్యుత్ షాక్ సమస్య తలెత్తుతోంది. గతంలో ఓ పేషెంట్‌కు ఆపరేషన్ జరుగుతుండగానే షార్ట్ సర్క్యూట్ జరిగి థియేటర్‌లోని వైర్లన్నీ కాలిపోయాయి. ఇప్పుడు కూడా తడిసిన గోడలన్నింటికీ విద్యుత్ షాక్ వస్తోంది. అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నా సమస్యలు ఉత్పన్నం అవుతూనే ఉన్నాయి. ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి విద్యుత్ షాక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే రోగుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని పేషెంట్ల బంధువులు చెబుతున్నారు.

నేడు కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్



కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, సలహాలు, సూచనల కోసం మున్సిపల్ కమిషనర్ సుజాతతో 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. పట్టణ ప్రజలు తమ సమస్యలపై నేరుగా కమిషనర్‌తో మాట్లాడవచ్చు. – కామారెడ్డి క్రైం

తేది: 20-07-2024 (శనివారం)

సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు..

నంబర్: 98499 07825

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

లింగంపేట(ఎల్లారెడ్డి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం ఆయన లింగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు 41 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మండల కేంద్రంలో డెంగీ, మలేరియా, ఫైలేరియా, డయేరియా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రిలో రోగులకు సరిపడా మందులు ఉన్నాయా అని ఆరా తీశారు. మందుల నిల్వ రికార్డులను తనిఖీ చేశారు.

సర్వే చేపట్టిన వైద్య సిబ్బంది

లింగంపేటలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు ఆధ్వర్యంలో విషజ్వరాల నమోదు సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు 50 మంది మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి లార్వా, విషజ్వరాల సర్వే నిర్వహించారు. జ్వరాలతో బాధపడే వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని సిబ్బంది తెలిపారు.

క్లుప్తంగా

సురాయి చెరువు కబ్జాను అడ్డుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ కట్టకింది తండా పరిధిలోని సురాయి చెరువు కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలను తీసుకోవాలని హాజీపూర్ తండా రైతులు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు విన్నవించారు. సురాయి చెరువు 86 ఎకరాల పరిధి ఉండగా ప్రస్తుతం 40 ఎకరాలకు పడి పోయిందన్నారు. చెరువు స్థలాన్ని కబ్జా కాకుండా సర్వే చేయాలని కలెక్టర్ ఆర్డీవో మన్నె ప్రభాకర్‌కు సూచించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కామారెడ్డి అర్బన్ : వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సొంతంగా ఎలాంటి రిపేర్లు చేయవద్దని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రమేశ్‌బాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎస్ఈ ప్రకటన చేశారు. ఇనుప రేకుల కింద దండాలపై దుస్తులు ఆరేయడం, ఇనుప వైర్లను ముట్టుకోవద్దన్నారు. రోడ్లపై విద్యుత్ సంబంధిత ఏ వస్తువును ముట్టవద్దన్నారు. గ్రామాల్లో లైన్‌మెన్ సేవలను వినియోగించుకోవాలని, మీటర్ బిల్లులో ఉంటే ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఎస్ఈ రమేశ్‌బాబు అన్నారు.

బాంఛన్.. పింఛన్ ఇప్పియ్యండ్రి..



మాచారెడ్డి: కూలీ పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్న నా భర్త పక్షపాతంతో ఐదేళ్ల క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి పింఛన్ కోసం ఎక్కని.. దిగని ఆఫీసు లేదు.. ఐదేళ్లుగా ఏదో ఒక కారణం చెబుతూ నా పింఛన్ దరఖాస్తును తీసుకుంటలేరు. నాయకులను, సార్లను అడుగుతనే ఉన్నా.. అయినా ఎవరూ పట్టించుకుంటలేరు.. బాంఛన్ నాకు పింఛన్ ఇప్పియ్యండ్రి అంటూ మాచారెడ్డి మండలంలోని చెరువు కొమ్ము తండాకు చెందిన వృద్ధురాలు మాలోత్ రేణుక తన గోడు వెల్లబోసుకుంటోంది.

బోనాలకు మహంకాళి ఆలయం సిద్ధం

- 51 ఏళ్లుగా అమ్మవారికి ప్రత్యేకపూజలు
- సికింద్రాబాద్ తర్వాత దోమకొండలోనే చాముండేశ్వరి గుడి
- 18 చేతుల్లో ఆయుధాలతో అమ్మవారు



ఆలయంలోని అమ్మవారు



దోమకొండలో ఉత్సవాలకు ముస్తాబైన చాముండేశ్వరి ఆలయం

దోమకొండ : భక్తుల కొంగు బంగారంగా నిలుస్తున్న దోమకొండలోని చాముండేశ్వరి అమ్మవారి ఆలయం బోనాల ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 21వ తేదీ ఆదివారం ఘనంగా బోనాలు తీయడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని మహంకాళి అమ్మవారు అని కూడా భక్తులు పిలుస్తారు. 51 ఏళ్ల క్రితం అమ్మవారి ప్రతిష్ఠాపన జరిగింది. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి తర్వాత దోమకొండలోని మహంకాళి ఆలయం ప్రసిద్ధిగాంచింది. అమ్మవారు 18 చేతుల్లో ఆయుధాలను కలిగి ఉంటుంది.

కామినేని వంశీయులు..

దోమకొండ సంస్థానానికి చెందిన కామినేని వంశీయులు ఆలయాన్ని నిర్మించినట్లు ఆధారాలు ఉన్నాయి. రాజస్థాన్‌లోని జైపూర్ నుంచి అమ్మవారి విగ్రహాన్ని తెప్పించి ప్రతిష్ఠించారు. ప్రతిఏటా ఆషాఢమాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే ఆదివారం సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారితో పాటు దోమకొండ మహంకాళి ఆలయంలో బోనాల పండుగ ఘనంగా నిర్వహిస్తా రు. మండల కేంద్రానికి చెందిన దాదాపు 4వేల పైచిలుకు మహిళలు అమ్మవారికి బోనాలు తీస్తారు. బోనాల పండుగ ఆదివారం ఉదయం 6 గంటలకు పోతరాజులతో ఘటం ఊరేగింపు ప్రారంభిస్తారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు భవిష్యవాణి ఉంటుంది.

ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు

కామారెడ్డితో పాటు సిద్దిపేట, సిరిసిల్లా రాజన్న జిల్లా వాసులు, నిజామాబాద్, మెదక్, హైదరాబాద్ ప్రాంతాల వారు వస్తుంటారు. మహారాష్ట్రలోని ముంబాయి, బీవండి, షోలాపూర్ తదితర ప్రాంతాల నుంచి ఇక్కడి బంధువుల ఇళ్లకు భక్తులు బోనాల ఉత్సవాలకు విచ్చేస్తారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ప్రతిఏటా ఆషాఢమాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే ఆదివారం దోమకొండ చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో బోనాలను తీయడం అనవాయితీగా వస్తుంది. 51 ఏళ్లుగా బోనాల ఊరేగింపు నిరాటంకంగా కొనసాగుతుంది. ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ ఏడాది అమ్మవారికి రాజగోపుర నిర్మాణం కూడా భక్తుల ఆర్థిక సహకారంతో పూర్తయింది.

– భావి శరత్‌చంద్ర శర్మ, ఆలయ ప్రధానార్చకులు, దోమకొండ

మాకు రుణమాఫీ కాలేదు..



రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయగా జిల్లాలోని కొన్ని మండలాల్లో అర్హులైన రైతులకు రుణం మాఫీ కాలేదు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. తమకు అర్హత ఉన్నా రుణామాఫీ కాకపోవడంతో వారు బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

రెండ్రోజులుగా తిరుగుతున్నా..



బాన్సువాడ : బ్యాంకులో పట్టా పాసు పుస్తకంపై ఆరేళ్ల క్రితం రూ.45 వేలు పంట రుణం తీసుకున్నా. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని తెలిసి బ్యాంకుకు వెళ్తే నా పేరు లేదు. రెండు రోజులుగా బ్యాంకు చుట్టు తిరుగుతున్నా. వారం రోజుల తర్వాత వచ్చే లిస్టులో పేరొస్తుందని చెబుతున్నారు. మా లాంటి గరీబోళ్లకు రుణమాఫీ చేసి ప్రభుత్వం ఆదుకోవాలి. మాకు మాఫీ చేస్తేచాలు. –హోటల్ రాములు, బాన్సువాడ

లిస్టులో నా పేరు లేదు..



కామారెడ్డి రూరల్ : రుణమాఫీ మొదటి లిస్ట్‌లో నా పేపరు లేదు. దేవునిపల్లి ఎస్‌బీఐలో రూ.80 వేల రుణం తీసుకున్నాను. అయితే లక్ష వరకు మొదటి విడతలో రుణమాఫీ కావాల్సి ఉండగా నాకు జరగలేదు. ఏమయిందో తెలియట్లేదు.అధికారులు న్యాయం చేయాలి. –దర్శపు రమేష్, రైతు, దేవునిపల్లి

ఎన్నో ఆశలు పెట్టుకున్నా..



బిచ్కుంద(జుక్కల్) : మూడేళ్ల క్రితం వ్యవసాయ రుణం తీసుకున్నాను. ప్రభుత్వం నుంచి నాకు రుణామాఫీ రాలేదు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ. 50 వేలు రుణం తీసుకున్నా. మాఫీ వర్తిస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నా. బ్యాంకుకు వెళ్లి చూసేసరికి నాకు రుణమాఫీ రాలేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– కపిల్, రైతు, బిచ్కుంద

ఇప్పుడు కూడా రాలేదు..



బాన్సువాడ రూరల్ : సీఎం కేసీఆర్ హయాంలో రూ. 25 వేల చొప్పున విడతల వారిగా రుణమాఫీ చేసినప్పుడు కూడా నాకు కాని, నా భర్త సయ్యద్ అహ్మద్‌కు కాని రుణ మాఫీ జరగలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ రుణమాఫీ జరగలేదు. నా పేరుపై సొసైటీలో సుమారు రూ. 54 వేలు, ఎస్‌బీఐలో రూ. 68వేల బాకీ ఉంది. ఎక్కడ కూడా మాఫీ జ రుగలేదు. అధికారుల లాగిన్‌లో 'కు టుంబ సభ్యుల నిర్ధారణ జరుగలేదు' అని చూపిస్తోంది.

– జమీలా బేగం, బోర్లం, బాన్సువాడ

చెరువును తలపిస్తున్న పంట పొలాలు



జాతీయ రహదారి పక్కన నీటమునిగిన పంట

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : రాత్రి కురిసిన భారీవర్షానికి మండల కేంద్రంలోని 161 జాతీయ రహదారి పక్కన ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. చాలా ప్రాంతాల్లో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. 161 జాతీయ రహదారి కింద ఉన్న కల్వర్టు మట్టితో ముసుకుపోవడంతో హైవే పక్కన ఉన్న పంటపొలాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. కల్వర్టులో మూసుకుపోయిన మట్టిని తొలగించాలని రైతులు కోరుతున్నారు.

డ్రెయినేజీలను శుభ్రం చేయించాలి



బాన్సువాడ : వర్షకాలం దృష్ట్యా గ్రామాల్లో డ్రెయినేజీలను శుభ్రం చేయించాలని శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో బీర్కూర్ ఎంపీడీవో భారతికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షులు నాగేళ్ల సాయికిరణ్ దోమల నివారణ మందులు పిచికారీ చేయించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. బీజేపీ నాయకులు శ్రీనివాస్, యోగేష్, రవి, బీరుగొండ తదితరులున్నారు.

'వనమహోత్సవంలో పాల్గొనాలి'



బాన్సువాడ రూరల్ : వనమహోత్సవంలో ప్రజలు భాగస్వాములు కావాలని బాన్సువాడ ఆర్డీవో రాథోడ్ రమేశ్ అన్నారు. శుక్రవారం దేశాయిపేట్‌లో వన మహోత్సంలో పాల్గొని మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం పాఠశాల పునః ప్రారంభం రోజే విద్యార్థులకు దుస్తులు ఇవ్వాల్సి ఉందని ఇంకా దుస్తుల కుట్టడంపై పూర్తికాకపోవడంపై ఎంపీడీవో బషీరుద్దీన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద వ్యక్తుల నిర్బంధం



గ్రామస్తులు పట్టుకున్న అనుమానాస్పద వ్యక్తులు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని గున్కుల్ గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని గ్రామస్తులు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. గ్రామంలోని పలు కాలనీల్లో తిరుగుతుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. నిర్మల్, గాంధారికి చెందిన ఇద్దరు వ్యక్తులు గ్రామంలో సంచరిస్తుండగా గ్రామస్తుటు వారిని పట్టుకొని విచారించగా అందులో ఒకరు నిర్మల్‌లో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడంతో పాటు పలు దొంగతనాలు చేసి నట్లు ఒప్పుకున్నట్లు గ్రా మస్తులు పేర్కొన్నారు. వీరిని పోలీసులకు అప్పగించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఎస్టీవోలో కూలిన పైకప్పు



కార్యాలయంలో టేబుల్‌పై పడిన సిమెంట్ పెచ్చులు

మద్నూర్(జుక్కల్) : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ఎస్టీవో కార్యాలయంలోని పైకప్పు కూలడంతో కంప్యూటర్లు ధ్వంసమయ్యాయి. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం పక్కన ఉన్న ఎస్టీవో కార్యాలయంలో శుక్రవారం విధులకు హాజరైన సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. కార్యాలయం సీలింగ్ మొత్తం వర్షానికి నాని కూలి టేబుల్‌పై పడిపోయిందన్నారు. టేబుల్‌పై ఉన్న కంప్యూటర్, ఫైళ్లు తడిసిపోయాయన్నారు. గతంలో కూడా ఇలా కార్యాలయ పైకప్పు కూలిన సంఘటనలు ఉన్నాయని ఆఫీస్‌లో పనిచేయాలంటే భయంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్



బాన్సువాడ : బీర్కూర్ మండల పీఆర్టీయు మండల అధ్యక్షులుగా వాసంశెట్టి దుర్గాప్రసాద్‌ను శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులుగా సయ్యద్ హాజీ, ఉపాధ్యక్షులుగా సుమలత, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, సహాయ కార్యదర్శిగా చీదరి రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్ల కార్యవర్గ సభ్యులు

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్స్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం శుభం కాన్వెన్షన్‌లో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆసం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా హరాలే సురేష్, కోశాధికారిగా గోగు భూపాల్‌రెడ్డి మూడేళ్ల కాలానికి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.నవీన్‌కుమార్ హాజరయ్యారు.

మొక్కలు నాటిన ఎక్సైజ్ అధికారులు



మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని సబ్దల్‌పూర్‌లో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ఈత మొక్కలను నాటారు. శివారులోని కుంట కట్టపై 500 ఈత మొక్కలను నాటినట్లు ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.

కుక్కలతో భయం.. భయంగా..



మద్నూర్‌లో తిరుగుతున్న కుక్కలు

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలో కుక్కల సంచారం ఎక్కవగా ఉండడంతో గ్రామస్తులు భయపడుతున్నారు. గతంలో కుక్కల దాడిలో గ్రామస్తులు తీవ్ర గాయాలతో ఆస్పత్రులలో చేరిన సంఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

చెరువులో పడి మహిళ ఆత్మహత్య



సాయవ్వ(ఫైల్)

పిట్లం: మండల కేంద్రంలోని ఊర చెరువులో పడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలోని బీబీపేటకు చెందిన సాయవ్వ(51) పిట్లం ఊర చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. చెరువులో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం



బాదావత్ రాజు

నిజామాబాద్ రూరల్: మండలంలోని చక్రధర్‌నగర్ తండాకు చెందిన బాదావత్ రాజు అనే యువకుడు అదృశ్యమైనట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ శుక్రవారం పేర్కొన్నారు. ఇంటి నుంచి ఈనెల 7న బయటకు వెళ్లిన రాజు తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. రాజు తల్లి అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో చోరీ



లింగంపేట:మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి భవనంపై నుంచి లోపలికి ప్రవేశించి కార్యాలయ గది తాళాన్ని పగులగొట్టారు. గదిలో ఉన్న రెండు సీపీయూలు, ప్రింటర్, మానిటర్, కీబోర్డులను అపహరించినట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో నరేశ్ ఫిర్యాదు మేరకు కార్యాలయాన్ని సందర్శించి వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

ఖలీల్‌వాడి: నగరంలోని దేవీ టాకీస్ ప్రాంతంలోని ఓ టీచర్ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై పాండేరావు శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన శ్రీనివాస్ తన ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన రూ. 4 లక్షల నగదును బీరువాలో పెట్టారు. భార్య అంగన్‌వాడీ టీచర్ కావడంతో ఉదయం ఆమె సెంటర్‌కు వెళ్లగానే ఇంట్లో ఉన్న శ్రీనివాస్ తన తల్లిని తీసుకొని పనినిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. దుండగులు ఈ విషయాన్ని గ్రహించి ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. బీరువాలో ఉన్న వస్తువులను పడేసి రూ. నాలుగు లక్షల నగదును దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిట్టాపూర్‌లో..



బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్‌కు చెందిన పుంచెట్టి లింగన్న ఇంట్లో శుక్రవారం దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై యాసర్ అర్ఫాత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగన్న కుటుంబ సభ్యులు ఉదయం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చిన లింగన్నకు ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో గమనించి ఇంట్లోకి వెళ్లి పరిశీలించాడు. చోరీ జరిగినట్లు పోలీసులకు సమాచారం అందించాడు. బీరువాలో ఉన్న 8.5 తులాల బంగారు ఆభరణాలు, రూ. 50 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



రవి మృతదేహం

ఎల్లారెడ్డిరూరల్: కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని అన్నాసాగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొనగండ్ల రవి(32) తన పంట పొలంలో నాటు వేసేందుకు వెళ్లగా నారు గంపను నెత్తిన పెట్టుకుని వస్తున్న సమయంలో కిందికి వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన పొలంలోని రైతులు ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని చివరికి తమ కుటుంబ పెద్దను కోల్పోవాల్సి వచ్చిందని కుటుంబీకులు బోరున విలపించారు. రవి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు విన్నవించారు. విచారణ చేపట్టి నివేదిక పంపాలని ఆర్డీవో ప్రభాకర్‌ను కలెక్టర్ ఆదేశించారు. కుటుంబీకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై మహేశ్ పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: వినాయక్‌నగర్ ప్రాంతంలో జరిగిన యువకుడి హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ నరహరి శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వినాయక్‌నగర్‌లో బుధవారం ఉదయం మురళి హోటల్ ముందు జరిగిన హత్య కేసులో నిందితుడు సాయి కుమార్‌ను అమ్మ వెంచర్ ప్రాంతంలో పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. వంశీ వినాయక లిక్కర్ మార్ట్‌లో నిందితుడు సాయికుమార్, మృతుడు ఆనంద్ బిహారి పాండే రాత్రి మద్యం తాగారు. మూత్రవిసర్జనకు వెళ్తున్న సాయికుమార్‌ను మద్యం మత్తులో ఆనంద్ వెనుక నుంచి నెట్టివేశాడు. దీంతో వీరి మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది. అనంతరం అక్కడి నుంచి బయటకి వచ్చిన వీరు తిరిగి ఇదే విషయంలో అర్ధరాత్రి రోడ్డుపై గొడవ పడ్డారు. సాయికుమార్ ఆనంద్‌ను గొంతుపట్టి నెట్టివేయడంతో కిందపడిపోయాడు. అక్కడున్న బండరాయితో తలపై మోదాడంతో మృతి చెందాడు. కేసును ఛేదించడంలో ఎస్‌హెచ్‌వో పాండేరావు, ఏఎస్సై సాయిలు, సిబ్బంది మనోజ్, అనిల్, బాలాజీ, భూరాజ్, సంగేస్, నారాయణ, రవి రమేశ్, రాకేశ్ ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు.

బ్యాంక్ మేనేజర్‌పై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని పెద్దబజార్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ అజయ్‌పై చీటింగ్ ఫోర్జరీ కేసు నమోదు చేసినట్లు సీఐ నరహరి తెలిపారు. అజయ్ బ్యాంకు మేనేజర్‌గా 2022 నుంచి 2024 జూలై5 వరకు పనిచేసినట్లు చెప్పారు. బ్యాంకుకు వచ్చిన ఖాతాదారుల నుంచి చీటింగ్, ఫోర్జరీలు చేసి రూ.88.80 లక్షల నగదును వాడుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు

ఖలీల్‌వాడి: నగరంలోని పలు లాడ్జీల్లో పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. లాడ్జీల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు సీసీఎస్ ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఉమెన్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరహరి, నాలుగో టౌన్ ఎస్‌హెచ్‌వో పాండేరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట నష్టం



ధ్వంసమైన పంట

తాడ్వాయి: మండలంలోని దేమికలాన్ శివారులో మొక్కజొన్న పంటపై అడవి పందులు గురువారం రాత్రి దాడి చేసినట్లు రైతులు శుక్రవారం తెలిపారు. సుమారు 2 ఎకరాల్లో ఉన్న పంటపై దాడి చేయడంతో తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం సంబంధిత అధికారులతో విచారణ చేయించి నష్ట పరిహారం ఇప్పించాలని బాధిత రైతులు రమేశ్, శ్రీకాంత్ కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ 13వ వార్డు పరిధిలో డెంగీ, మలేరియా జ్వరాలు రాకుండా దోమల నివారణకు మందును మురికి కాలువల వెంట పిచికారీ చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా ఇంటింటికీ తిరిగి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎప్పటికప్పుడు నీటి తొట్టిలను శుభ్రపరచుకోవాలని వివరిస్తూ దోమలు నిలవకుండా పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవళి, నవీన్, ఏఎన్ఎం సుజాత తదితరులున్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



రాజంపేట : మండలంలోని ఎల్లారెడ్డిపల్లి తండాలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు గడ్డమీది స్వామి పాఠశాలలో పదకొండేళ్లుగా విధులు నిర్వహించి ఇటీవల ఆర్గొండ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యాడు. దీంతో తండావాసులు శుక్రవారం ఉపాధ్యాయుడు స్వామిని సన్మానించారు. ఆయనతో పాఠశాలకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం, తండావాసులు బన్సీలాల్, పీర్యా, బద్రియ, భాస్కర్ తదితరులున్నారు.

బాల కార్మిక చట్టం కింద కేసు నమోదు

ఎల్లారెడ్డి: బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న కిరాణ దుకాణ యజమాని రవీందర్‌పై బాల కార్మిక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. పట్టణంలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న రవీందర్ 13 ఏళ్ల బాల కార్మికుడిని పనిలో పెట్టుకున్నారు. విషయం తెలుసుకున్న లేబర్ ఆఫీసర్ షేక్ దావుద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాలువను ధ్వంసం చేసిన ఘటనలో ముగ్గురిపై..

ఎల్లారెడ్డి: మండలంలోని మాచాపూర్ శివారులో ఉన్న మల్లారెడ్డి చెరువు కాలువను ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని తాటిచెట్టు గడ్డతండాకు చెందిన గణ్యా, రమేశ్, దేవీసింగ్‌లు మల్లారెడ్డి చెరువు కాలువను ఈనెల 14న ధ్వంసం చేశారని స్థానిక రైతులు నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నీటి పారుదల శాఖ ఏఈ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు



బాన్సువాడ రూరల్ : మండల కేంద్రంలో శుక్రవారం టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బాన్సువాడ ఆర్డీవో రమేష్ రాథోడ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి పలువురికి సభ్యత్వం అందించారు.